సాధకుడే.. శిక్షకుడైన వేళ

నిరంతర కృషి, పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం సొంతం.. అన్న మాటను సార్థకం చేశాడు ఈ ఉక్కు ఉద్యోగి. అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం పొందడానికి యోగా సాధన ఆరంభించి తన ఉక్కు సంకల్పంతో శిక్షకుడిగా ఎదిగాడు. యోగా విద్యను పది మందికి పంచుతున్నాడు. మరో వైపు యోగా పోటీల్లో పాల్గొంటూ పతకాలు కొల్లగొడుతున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి వెంకటరమణ విజయప్రస్థానం ఇదీ...



ఏకపాద వక్ష మయూరాసనం



యోగాలో శిక్షణ పొందుతున్న చిన్నారులు

అనారోగ్య సమస్యలతో యోగ వైపు..

పట్టు సాధించడంతో యోగా గురువుగా గుర్తింపు



బకాసనం

ఉక్కునగరం: ప్రాచీన యోగా ఆధునిక ప్రపంచంలో విశ్వవ్యాప్త మైంది. యోగా సాధన వల్ల శారీరక మానసిక, ఆరోగ్యం కలుగుతుండడంతో దాని ప్రాముఖ్యం పెరిగింది. స్పాండిలైటిస్, గ్యాస్ట్రిక్ సమస్యతో బాధపడిన స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ విభాగంలో చార్జ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటరమణ స్నేహితుడి సలహాతో ఉక్కు స్టేడియం లోని యోగా గురువు ఎ. కనకరావు వద్ద యోగా శిక్షణ కోసం చేరారు. అక్కడ మూడు నెలల పాటు చేసిన అభ్యాసంతో స్పాండిలైటిస్, గ్యాస్ట్రిక్ సమస్యలు నయమయ్యాయి. దీంతో అతనికి యోగాపై పూర్తి విశ్వాసం ఏర్పడింది. అప్పటి నుంచి పూర్తిగా యోగసాధనలో నిమగ్నమయ్యారు. ఆ తర్వాత కనక రావు ప్రియ శిష్యుడిగా మారారు. ఆ క్రమంలో గురువు సూచన మేరకు ఆంధ్రా యూనివర్సిటీలో యోగాలో పీజీ డిప్లమో పూర్తి చేశారు.

అవార్డులు, పతకాలు

పలు పోటీల్లో పాల్గొని అవార్డులు, పతకాలు సాధించారు. వెంకటరమణ ఇప్పటి వరకు మూడు జాతీయ స్థాయి పతకాలు సాధించగా, రాష్ట్ర స్థాయి పోటీల్లో నాలుగు పతకాలు గెలుపొందారు. ఉత్తరాంధ్ర స్థాయి రెండు, స్టీల్‌ప్లాంట్ స్థాయిలో మరో రెండు అవార్డులు సాధించారు.

ఉచిత శిక్షణ తరగతులు

నేర్చుకున్న విద్యను పలువురికి అందించాలనే ఉద్దేశంతో ఆయన శిక్షకుడిగా మారారు. ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్ పలువురికి ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ముఖ్యంగా పిల్లలకు ఏకాగ్రతపై ప్రత్యేక శిక్షణ అందజేస్తున్నారు. తద్వారా సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

వ్యాధులు నయం

నేర్చుకున్న యోగా విద్యతో ఆయన పలువురికి స్పాండిలైటిస్, గ్యాస్ట్రిక్, అల్సర్లు, సయాటికా, మధుమేహం, ఒబెసిటీలపై శిక్షణ ఇవ్వడంతో పాటు అనేక మంది ఆయా వ్యాధుల నుంచి ఉపశమనం పొందారు. అదే విధంగా మహిళలకు పీసీవోడీ, ఇన్‌ఫెర్టిలిటీ సమస్యలను అధిగమించేలా శిక్షణ ఇస్తున్నారు.



షీల్డ్ అందుకుంటున్న వెంకటరమణ

సమాజ ఆరోగ్యం లక్ష్యం



ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుంది. ప్రతీ ఒక్కరూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండడంతో పాటు చిన్నపాటి రోగాలను దూరం చేసుకోవచ్చు. నేను స్వయంగా ఆ ఫలితాలు అనుభవించడం వల్ల శిక్షణ అందజేస్తున్నాను. మరింత మందికి ఉచితంగా శిక్షణ ఇస్తాను.

– ఎన్.వి. రమణ, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి

మానవ వనరుల బలోపేతమే లక్ష్యం



స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండేను సత్కరిస్తున్న ఎన్ఐపీఎం ప్రతినిధులు

ఉక్కునగరం: హెచ్ఆర్ భవిష్యత్తు కేవలం వనరులను నిర్వహించడమే కాదు.. శక్తివంతం చేయడం ధ్యేయంగా ముందుకు సాగాలని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ ఎస్.సి. పాండే అన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీఎం) వైజాగ్ చాప్టర్, విశాఖ స్టీల్‌ప్లాంట్ సంయుక్తంగా శుక్రవారం ఉక్కు మేనేజ్ మెంట్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో 'హెచ్ఆర్‌లో ఎమర్జింగ్ ట్రెండ్స్' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ప్రజల సామర్థ్యాన్ని వెలికితీయడం హెచ్ఆర్ ఉద్దేశ్యమన్నారు. ఈ సందర్భంగా ఆయన తన కెరీర్, అనుభవం నుంచి పలు ఉదాహరణలు తెలియజేశారు. ఎన్ఐపీఎం మాజీ చైర్మన్ ఎస్. సాంబశివ రావు ఆధునిక జీవనశైలిలో కుటుంబం ప్రాముఖ్యతను తెలిపారు. సీజీఎం జి. గాంధీ నెట్‌వర్కింగ్‌లో వృత్తిపరమైన సంస్థల పాత్రపై ప్రసంగించారు. హెచ్ఆర్ కన్సల్టెంట్, కార్పొరేట్ ట్రైనర్ డాక్టర్ ముత్యాల బాలాజీ, స్టీల్‌ప్లాంట్ డీజీఎంలు ఎ. బద్రీనాథ్, ఆదిశేష నియాక్, హెచ్‌పీసీఎల్ సీనియర్ మేనేజర్ బి. శ్రీకాంత్, ఎన్‌టీపీసీ సీనియర్ మేనేజర్ ఆదిత్య వివిధ అంశాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ పాండేను సత్కరించారు. ఎన్ఐపీఎం విశాఖ చాప్టర్ కార్యదర్శి బి. శేషగిరిరావుతో పాటు పలు సంస్థలకు చెందిన 70 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ మధుసూధనరావు

అగనంపూడి: భూ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని రెవెన్యూ సదస్సుల మండల ప్రత్యేకాధికారి ఎ.మధుసూదనరావు కోరారు. 85వ వార్డు కొండయ్యవలస సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడంగల్ రిజిస్టర్, వన్ బీ రిజిస్టర్, 22ఏ జాబితాలో ఉన్న భూ వివాదాల పరిష్కారం కోసం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అలాగే 79,85 వార్డుల పరిధిలోని శనివాడలో 21వ తేదీన, తలారివానిపాలెంకు చెందిన రెవెన్యూ సదస్సు 24వ తేదీన అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు.

వినతులు ఇలా

రైతుబజార్‌కు స్థలం కేటాయించాలని, స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం భూములు ధారాదత్తం చేసిన నిర్వాసితులకు ఉపాధి కల్పిస్తున్న ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించాలని వినతులు అందజేశారు. నిర్వాసితుల భూములు రైతులకు తిరిగి ఇచ్చేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కార్యదర్శి పరమేశ్వరరావు, నాయకులు బి.సత్యనారాయణ, డి.రమేష్, వి.శ్రీను, జి.పద్మ పాల్గొన్నారు.

కార్పొరేటర్ గోవింద రెడ్డి క్షమాపణలు చెప్పాలి

సచివాలయ సిబ్బంది డిమాండ్

అక్కిరెడ్డిపాలెం: సచివాలయ సిబ్బందికి 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి భే షరతుగా క్షమాపణ చెప్పాలని 69వ వార్డు సచివాలయ సిబ్బందితో పాటు పలు సచివాలయాల ఉద్యోగులు డిమాండ్ చేశారు. గ్రేటర్ కౌన్సిల్ సమావేశంలో సచివాలయ వ్యవస్థపై ఆయన మాట్లాడిన మాటలపై సచివాలయ ఉద్యోగులు మండిపడుతున్నారు. విధుల్లో ఎంతో ఒత్తిడిని తట్టుకుని పనిచేస్తున్నామని.. అవసరమైతే మంచి భవిష్యత్తు కల్పించే విధంగా ప్రభుత్వం నుంచి సహకారం అందించాలే తప్పా ఉద్యోగులను కించపరుస్తూ వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయ ఉద్యోగులు ఓ ప్రకటన విడుదల చేశారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

గాజువాక: వినియోగదారుల హక్కులు, చట్టాలపై స్థానిక చైతన్య మహిళా కళాశాల విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గాజువాక లయన్స్ క్లబ్, వినియోగదారుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పరిరక్షణ సమితి వ్యవస్థాపక చైర్మన్ రామానుజస్వామి ప్రసంగించారు. వస్తువులు కొనుగోలు చేసే సమయంలో ధర, పరిమాణం, గడువు తేదీలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఎప్పుడైనా సమస్యలు ఎదురైతే వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదు చేసిన 90 రోజుల్లో నష్టపరిహారం వచ్చేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మార్టిన్, ఉపాధ్యక్షులు వి.ఎస్.ఎన్.మూర్తి, పి.బాబు, కళాశాల కరస్పాండెంట్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ ఎస్.చంద్ర మహాలక్ష్మి, కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జంగమ వనసమారాధన రేపు

ఉక్కునగరం: విశాఖ జంగమ వనసమారాధన ఆదివారం ఉక్కు జనరల్ ఆస్పత్రి రహదారిలోని సీతారాములు ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు కమిటీ అధ్యక్షుడు శృంగార కవి మహేశ్వరరావు, ప్రధానకార్యదర్శి పూడి ఈశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పాలంకి సత్య రమేష్ తెలిపారు. శుక్రవారం జరిగిన కమిటీ సమావేశంలో వారు మాట్లాడుడారు. ఆ రోజు వన సమారాధనలో వివాహ పరిచయ వేదిక కూడా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పార్వతీ పరమేశ్వరుల ఆరాధన, ప్రతిభ చూపిన కులంలోని పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేయనున్నామన్నారు. సభ్యులంతా తమ కుటుంబ సభ్యులతో హాజరు కావాలని వారు కోరారు. సమావేశంలో మాజీ అధ్యక్షుడు పాలంకి రామారావు, చూచు కొండ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే చెత్త వేరు చేసి ఇవ్వండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జెడ్సీ శేషాద్రి, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: తడి–పొడి చెత్తపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జోన్–6 జోనల్ కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. వార్డు పరిధిలో నెహ్రూనగర్‌లోని మార్వెల్ స్కూల్ ఆవరణలో శుక్రవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరసింగరావు ఆధ్వర్యంలో కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డితో కలసి స్థానికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్లలోని చెత్తను వేర్వేరుగా జీవీఎంసీ శానిటరీ సిబ్బందికి అందజేసి సహకరించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని కోరారు. ప్లాస్టిక్‌ను విచ్చల విడిగా వినియోగించడం ద్వారా పర్యావరణానికి హాని కలుగుతుందని వివరించారు. వారంలో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ శుభ్రత పాటిస్తే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. ఇళ్లలోని చెత్తను రోడ్లు, కాలువల్లో వేయవద్దని, తద్వారా దోమలు వృద్ధి చెంది వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండబాబు, గంగరాజు, శ్రీను, సింహాద్రి పాఠశాల హెచ్ఎం నరసింహారెడ్డి, జీవీఎంసీ సిబ్బంది సాంబమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు పోరుకు మేము సైతం..



కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వడ్లపూడి తరలివెళ్లిన నాయకులు, కార్యకర్తలు



బొడ్డ గోవింద్ సారథ్యంలో రైతు పోరుకు కణితి కాలనీల నుంచి వెళ్లిన కార్యకర్తలు

అగనంపూడి: అన్నదాతకు అండగా విశాఖ కలెక్టరేట్ వద్ద నిర్వహించిన రైతు పోరుకు 87వ వార్డు వడ్లపూడి నుంచి వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో గాలి నూకరాజు, వడ్లపూడి ఈశ్వరరావు, జెర్రిపోతుల ఈశ్వరరావు, కోనేటి పారిపల్లి, గెద్దాడ నూకరాజు, బొడ్డు సుమంత్, కాండ్రేగుల మనోహర్ పాల్గొన్నారు.

- కణితి నిర్వాసితకాలనీల నుంచి వైఎస్సార్‌సీపీ గాజువాక క్లస్టర్ అధ్యక్షుడు బొడ్డ గోవింద్ సారథ్యంలో కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో చిత్రాడ రమణ, శ్రీను, నూకరాజు, పిన్నింటి సంతోష్, నరసింహమూర్తి, అప్పిని సన్యాసిరావు, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.
- 85వ వార్డు అగనంపూడి నుంచి రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో కార్యకర్తలు రైతుపోరుకు హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు యలమంచిలి అప్పారావు, పట్టా రామకృష్ణ, యలమంచిలి కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న సీఐ పార్థసారథి, ఎపెకా ప్రతినిధులు

గాజువాక: ఆల్ పాస్టర్స్ ఎవాంజిలిస్ట్స్, చర్చెస్ అసోసియేషన్ (ఎపెకా) ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాతగాజువాకలోని యెహోవా షమ్మా చర్చిలో నిర్వహించిన కార్యక్రమంలో గాజువాక సీఐ పార్థసారథి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బిషప్ ధనరాజు క్రిస్మస్ సందేశాన్ని అందజేశారు. మానవాళిని రక్షించేందుకు యేసుక్రీస్తు జన్మించారని, ఆయన బోధనలు, ప్రేమతత్వం అందరికీ అనుసరణీయమన్నారు. సభ్యులు క్రిస్మస్ గీతాలు ఆలపించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ క్యాండిల్ సర్వీస్ నిర్వహించారు. ఎపెకా చైర్మన్ అద్దేపల్లి రవిబాబు, అధ్యక్షుడు బిల్లీగ్రహం, పుచ్చా విజయ్ కుమార్ మాట్లాడుతూ గాజువాక, పారిశ్రామిక వాడ క్రైస్తవుల కోసం కమ్యూనిటీ హాల్ ఏర్పాటుతో పాటు శ్మశాన వాటిక సాధన కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎపెకా ప్రతినిధులు అశోక్‌బాబు, డేవిడ్‌రాజు, లక్ష్మీనారాయణ, పలు సంఘాల పాస్టర్లు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన నిలిపితే ట్రాఫిక్

- లోపలకు వెళితే కేసులు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- దువ్వాడ రైల్వేస్టేషన్‌లో దుస్థితి



రోడ్డు పక్కన నిలిపిన వాహనాలు... ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారిన వైనం

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌కు బంధువులు, స్నేహితుల కోసం వాహనాలపై వెళ్లిన వారు అవస్థలు పడుతున్నారు. రోడ్డు పక్కన వాహనం నిలిపితే ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. అదే వాహనంతో లోపలికి వెళితే ఆర్పీఎఫ్ సిబ్బంది బండి తాళాలు బలవంతంగా లాక్కోవడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం ముఖ ద్వారం పక్కన ఖాళీ ప్రదేశం ఉంది. అక్కడ పార్కింగ్ వాహనాలు నిలిపితే ఆర్పీఎఫ్ సిబ్బంది నరకం చూపిస్తున్నారని వాపోతున్నారు. ఎవరికీ కనిపించకుండా చిన్నసైజ్‌లో నో పార్కింగ్ జోన్ అని బోర్డు గోడకు వేలాడదీశారు. అయితే విజయవాడ వైపు నుంచి వచ్చే రైళ్లకు గాజువాక, పెదగంట్యాడ, స్టీల్‌ప్లాంట్, పరవాడ, సబ్బవరం, ప్రాంతాలకు చెందిన వేలాది మంది ప్రయాణికులు దువ్వాడలో దిగుతున్నారు. వీరిని రిసీవ్ చేసుకోడానికి వచ్చిన కార్లు, ద్విచక్రవాహనాలు రోడ్డు, కాంపౌండ్‌వాల్‌ను ఆనుకొని పార్కింగ్ చేయాల్సి వస్తుంది. ఖాళీ లేని సమయాల్లో గోడను ఆనుకొని లోపల పెడితే ఆర్పీఎఫ్ సిబ్బంది బళ్లకు తాళాలు వేసేస్తున్నారు. కార్యాలయంలో అధికారులను కలవాలని హుకుం జారీ చేస్తున్నారు. కనీసం వాహనాన్ని పక్కకు నిలుపుతామని, కుటుంబ సభ్యులతో ఉన్నామని చెప్పినా ససేమేరా అంటున్నారు. ఇలా ఉదయం వేళల్లో వచ్చే రైళ్లకు పదుల సంఖ్యలో వాహనాలకు తాళాలు వేసి కార్యాలయం చుట్టూ తిప్పిస్తున్నారు. రెండు రోజుల తర్వాత సమయం చెబుతాం కోర్టుకు రావాలని బెదిరిస్తుండడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. ఫారాలు నింపడం, ఆధార్ కార్డు జెరాక్స్‌లు తీసుకోవడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని భాస్కర రావు, కనకరాజు అనే ప్రయాణికులు చెప్పారు.

షాపింగ్ మాళ్లకు దీటుగా..

- రోడ్ల వెంబడి దుకాణాల్లో మోడల్ వస్త్రాలు
- పండగల సీజన్ కావడంతో పెరిగిన గిరాకీ



సినిమా హాల్ జంక్షన్ వద్ద ఫుట్‌పాత్ దుకాణంలో వివిధ మోడళ్ల వస్త్రాలు



కొత్తగాజువాకలో ఫుట్‌పాత్‌పై వస్త్ర దుకాణం

గాజువాక: గాజువాక మార్కెట్లకు పండగ కళ వచ్చింది. క్రిస్మస్, సంక్రాంతి సందడి మొదలు కావడంతో రోడ్లపక్క దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. షోరూమ్‌లు, వివిధ వ్యాపార సంస్థలకు దీటుగా వివిధ మోడళ్ల వస్త్రాలను అందుబాటులోకి తెచ్చారు. దీంతో రోడ్ల వెంబడి వస్త్ర దుకాణాలు కలర్‌ఫుల్‌గా కనిపిస్తున్నాయి. ఎన్ని షోరూమ్‌లు, షాపింగ్ మాల్స్ ఏర్పాటైనా రోడ్లపై వ్యాపారం మాత్రం నిత్యం పచ్చతోరణంగా ఉంటుంది. చిరువ్యాపారులు సైతం భారీగా వస్త్రాలు అందుబాటులో ఉంచారు. పెద్దపెద్ద షాపింగ్ మాళ్లలో లభిస్తున్న మోడళ్లకు దీటుగా కోల్‌కతా, ముంబై, చెన్నై, రాజస్థాన్, తిరుపూర్ వంటి ప్రాంతాల నుంచి రెడీమేడ్ దుస్తులు తెచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు.

షాపింగ్ మాళ్లల్లో డిస్కౌంట్‌ల జోరు

పెద్దదుకాణాలు, షాపింగ్ మాళ్లలో వ్యాపారులు స్టాక్ క్లియరెన్స్ పేరిట క్లాత్ ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసి వ్యాపార కార్యాకలాపాలు సాగిస్తున్నారు. దీంతో ఉదయం నుంచి రాత్రి పొద్దు పోయేవరకూ జనాలతో రద్దీగా మారుతున్నాయి. కొత్తగాజువాక నుంచి పాతగాజువాక వరకూ మెయిన్‌రోడ్డులో ఫుట్‌పాత్ వ్యాపారాలు పోటాపోటీగా సాగుతున్నాయి. గాజువాక మెయిన్‌రోడ్, కూర్మన్నపాలెం ప్రాంతాల్లో ప్రతి ఆదివారం టీషర్ట్‌లు, షర్టులు, జీన్స్ ఫ్యాంట్లు, చెప్పుల స్టాళ్లను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున అమ్మకాలు సాగిస్తున్నారు.

40 ఏళ్లుగా ఇదే వ్యాపారం



చెన్నై నుంచి కొత్త స్టాకు తెచ్చాను. క్రిస్మస్, సంక్రాంతి పండగలను దృష్టిలో పెట్టుకొని లక్షల విలువైన స్టాకును అందుబాటులో ఉంచాను. 15 రోజులుగా పండగ అమ్మకాలు సాగిస్తున్నాను. ప్రస్తుతం అమ్మకాలు ఆశాజనకంగానే సాగుతున్నాయి.

– శ్రీనివాస్, వ్యాపారి

వ్యాపారం బాగుంది



పదేళ్లుగా ఈ వ్యాపారం సాగిస్తున్నాను. చెన్నై, ముంబై, రాజస్థాన్ ప్రాంతాల నుంచి స్టాకు తీసుకొచ్చి అమ్మకాలు సాగిస్తాను. గాజువాకలో ఎక్కడ ఖాళీ దొరికితే అక్కడ స్టాల్ పెట్టి అమ్ముతాను. ఈ సంవత్సరం వ్యాపారం బాగుంది. 20 రోజుల కిందట కొత్త స్టాకు తీసుకొచ్చి పెట్టాను.

– శరత్ కుమార్, వ్యాపారి

అస్తవ్యస్తం.. పందులకు ఆవాసం



హరిజనజగ్గయ్యపాలెంలో శ్మశాన వాటికను ఆనుకొని మురుగులో పందుల సంచారం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు హరిజన జగ్గయ్యపాలెం శ్మశానవాటిక పరిసరాలు మురుగుతో జుగుప్సాకరంగా ఉన్నాయి. దీంతో ప్రాంతం పందులకు ఆవాసంగా మారింది. ఇక్కడ సంచరించిన పందులు గ్రామంలోని వీధుల్లో తిరగడంతో పలువురు భయాందోళన చెందుతున్నారు. వీటి ద్వారా వ్యాధులు విజృంభిస్తాయని ఆందోళనకు గురవుతున్నారు. ఈ ప్రాంతం షీలానగర్ ప్రధాన రహదారికి దగ్గరలో ఉండడంతో రోడ్లపై విక్రయించే వస్తువులపై క్రిమికీటకాలు వాలుతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు శ్మశానవాటికకు వెళ్లే సీసీ రోడ్డు కింద భాగం పూర్తిగా ధ్వసంమై ప్రమాదకరంగా ఉంది. దీంతో ఎటువంటి ప్రమాదం చోటు చేసుకుంటుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు.